శ్రీ బంది రామారావు

# సనాథా? అనాథా?

నిర్మల మలయ మారుతంలో తేలియాడ వలసిన నిర్మల జీవితం వృద్ధ వివాహపు సుడిగాలిలో చిక్కుకుని శిథిలమై పోయింది...

సనాథయైన ఆమె అనాథ జీవితానికి మరి జీవన జ్యోతి లేదూ...

'ఆహా ప్రపంచమా' అంటూ కూలబడింది నిర్మల. కండ్లవెంబడి నీళ్లుకారడం ప్రారంభించాయి. నిన్న మొన్నటికోడలు. ఆమెకిటువంటి సంతాపమా? చిన్నప్పటినుండి నేటివరకు తలితండ్రుల ప్రేమలో గడిచాయి రోజులు. ఏకాంతవాసం యేర్పాటుచేసుకుంది. చిన్ననాటి స్నేహప్రవాహము ప్రవహించింది. ఇప్పుడు చిన్నప్పటి చెలికత్తెలను పోగొట్టుకుంది. ఆ నిర్మల నేడు మరోప్రపంచంలోకి నెట్టుకురాబడింది. అయితే సంతాపమెందుకుండదు? ప్రపంచమంతా ఆమెకు క్రొత్త. కొన్నిరోజులకుగాని యీ ప్రపంచానికి అలవాటుపడదు. తన్నుతాను తెలుసుకోలేకపోతోంది నిర్మల. జీవితపర్యంతం తాను ఎట్లాగడపాలో ఆలోచనకు రాలేదు. రేపే ఆమె పాపపరిహారం జరుగుతుంది. అపుడామెకు సంతాపానికి బదులు స్వభావిక ఆనందంవస్తుంది. జీవితవిలువకూడ తెలుస్తుంది. ఆమె భవిష్యత్తు అంధకారమయం. నిర్మల పుట్టి పెరిగిందన్నమాటే గాని వ్యవహారజ్ఞానం శూన్యం. తనభవిష్యత్తును కళ్లారా చూచింది. ఏమిటి? ఘోర అంధకారం. ముళ్లడొంక. అడుగడుగునకు ఆపదలు. ఆపదలనుండి ముక్తిమార్గమేదీ కనబడలేదు. ఆమె ఆకాశమందు వెలుగులేని కిరణాలున్నాయి. పెద్దజ్వాల ఆమె కోమలహృదయంలో బయలుదేరింది. మనసుమాత్రం నిలకడలేదు. ఆమె తలితండ్రులే రక్షణకుబదులు కందకం త్రవ్వారు. పాపం నిర్మలకు సహాయంలేదు. చాల బాధపడుతూంది. ఏంచెయ్యాలి?...

ఆమె కొద్దిరోజులక్రితమే యీ యింట్లో పాదంపెట్టింది. ఇంటివద్ద స్నేహితురాండ్రు 'నిర్మల అత్తవారింటికెళితే యీవిధంగా ఉంటుందా? మనల్ని మరచిపోతుంది. మరల తిరిగివస్తే మనలను సరిగా చూడదు, సరిగా మాటాడదు, విసుక్కుంటుంది.' అని వేళాకోళం చేసేవారు.

నిర్మలవచ్చి రెండువారాలు గడచిపోయింది. తనపుట్టింటి గొడవలు మరచిపోయింది. కాని మనసు బాధిస్తూనే వుంది. మనోవేదన క్రమంగా మించింది. అయితే ఏమి? ఆమె కేవలం స్త్రీ ఆమెనోరు మెదిపితే సమాజం వేయికండ్లతో చూస్తూవుంటుంది. తనభాగ్యరేఖ ఆపదలతో పోరాడ్డానికి సిద్ధపడింది. గొప్పమార్పు వచ్చింది ఆమె జీవితంలో. ఆమె హృదయం కోమలం, కాని రాయైంది. స్త్రీ కంఠం మృదువు, కాని కటువయింది. ముఖాన కోపజ్వాల చెలరేగింది. ఎవరికోరకు? ఆమెకిదంతా తెలియదు. ప్రపంచమంటేనే ఆమె కసహ్యమయింది.

సంధ్యవేళ. నక్షత్రాలు ప్రకాసిస్తున్నాయి. గదిలో వంటరిగా చింతతోకూర్చుంది నిర్మల. ఆమె చింతఅనే చితిలోపడి మండిపోతుంది రాత్రింబవళ్లు. అదేదోగొప్పదే అయిఉంటుంది ఆమెనెవరో పిలిచారు. గుండెకొట్టుకుంది వేగంగా. శరీరం గగుర్పాటుచెందింది. అకస్మాత్తుగా కళ్లనీళ్లుకారాయి.

'నిర్మలా నీవు నాధర్మపత్నివి; నాకుశక్తిలేదు; నీవు కోపముచెంద నవుసరంలేదు. నీవులేకుండా భగవంతునిపూజ కాజాలదు. నేను భక్తుడనుకాని అసమర్థుడను; నాకోరకు నిన్ను పెండ్లాడలేదు; భగవంతుని పూజలు బాగాజరుగుటకు చేసుకున్నాను' అని ఎవరోచెప్పినమాటలు ఆమె బాగావింది.

'ఒంటరిగా నేను దేవాలయానికి వెళ్లలేను' అంది నిర్మల ఏడుస్తూ.

'గురుదేవు డున్నాడు.'

'ఉన్నాసరే, నేనుపోలేను.'

'నీకువెళ్లుటకు భయమువేస్తే మనిషిని పంపిస్తా'నని కాళీచరణబాబు నౌకరును పిలిచి వెళ్లమని బలవంతపెట్టాడు. నిర్మల పెద్దనిట్టూర్పువిడిచింది. ఆజ్ఞ తిరస్కరించటానికి ప్రయత్నించింది, కాని అది సాధ్యమా? ఆమె పూజ ప్రారంభించింది, స్నానంచేసి పూలతోసహా మందిరానికి పోతూంది రోజూ.

దినములుగడచిన కొలది ఆపదలువస్తున్నాయి. ఎల్లపుడు ఆమె సతీత్వం చెడగొట్టటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తన్ను వెంటాడే కాముకులనుగురించి పతిదేవుతో మొరపెట్టుకుంది. కాని లాభం లేదు. ఏమీచేతకానపుడేమిచేస్తుంది? వెక్కివెక్కి ఏడ్చింది.

ఆనాడు శ్రావణపూర్ణిమ. మందిర పూజారివచ్చాడు. 'నేడుమంచితిథి. యీరోజున మీభార్య ఉపవాసదీక్షతో పూజసల్పిన పుత్రుడు జన్మించును. రాత్రంతా అక్కడేఉండాలి'అని కాళీచరణబాబుకు చెప్పాడు. సంధ్యాసమయం. దేవాలయపు గడియారంమ్రోగింది. పతివ్రత, భారతనారి భర్తసేవకు హాజరైంది. ఆమాటలన్నీ నిర్మలకు చెప్పాడు, కాని ఆమె సందేహించింది. విధిలేక మందిరమువైపు ప్రయాణంకట్టింది. కండ్లవెంబడి నీళ్లు కారుతున్నాయి, కాని ఆవిడ సంతోషానికి అంతులేదు.

నిర్మల నటుపంపి కాళీచరణబాబు సంతానంఅనే ఆశలోమునిగి రాత్రిగడిపాడు. 5 గంటలయింది. దేవాలయపు తలుపులు తెరువబడలేదు. ఆలస్యం అయినకొలదీ 'నిర్మలవ్రతం ఫలించింది. రాత్రంతా మేల్కొనడంచేత యింకాలేవలేదు. గురుదేవ్‌కూడ యింకా మేల్కొనలేదు.' అని ఆలోచిస్తూన్నాడు కాళీచరణ్. యింతలో 8 అయింది. నౌకరునిపిలిచాడు, కాని జాడలేదు. మరుక్షణంలో 5, 6 పోలీసులు 'మీరేనా కాళీచరణబాబు? మీభార్యయేనా నిర్మల?' అంటూవచ్చారు. పోలీసు యినస్పెక్టరు 'మీరు మూడు ఖూనీలకు బాధ్యులైయున్నారు, మీ భార్యవ్రాసిన పత్రమిదిగో' నని జాబు చేతికిచ్చాడు. దానితో పాటు సంకెళ్లుకూడ తగిలించారు. తన భార్యవ్రాసిన పత్రాన్ని కాళీచరణబాబు యీవిధంగా చదువనారంభించాడు. 'సోదరులారా! నేను సనాథనైనా అనాథనైపోయాను. నాపతి కడువృద్ధుడు. 55 వ సం॥లో ఆయన నన్ను వివాహమాడారు. నేను వారిధర్మపత్నిని నన్నువారు అమర్యాదగా చూచారు. సంతానాపేక్షతో మందిరానికి పంపారు. అచట నా పాతివ్రత్యానికి భంగం గలుగపోయింది. దానిరక్షణ నిమిత్తం నేను స్వయంగా రెండు ప్రాణాలుతీసాను; నా ప్రాణంకూడ సమర్పించాను' చదువుతూ చదువుతూ బాబుకు కళ్లు మూతలుపడ్డాయి. ఇనస్పెక్టరును చూస్తూ చూస్తూ పక్కమీద కూలబడ్డాడు. వైద్యునితో నిమిత్తం లేకుండానే అతని ప్రాణాలుకూడా ఎగిరిపోయాయి.

(అనువాదం)